
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | శనివారం 17 మే 2025 | పేజీలు : 4 | వెల : 3/-



## ఆగస్టు 15న మహిళలకు

# పండుగ



- ఆ రోజు నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ప్రతి నెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి సారించాలి
- 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేస్తాం
- సీఎం చంద్రబాబు వెల్లడి



**(అంకుశం, కర్నూలు, మే 17):**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు వెల్లడించారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో శనివారం ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు. అంతకుముందు కర్నూలు సి%-%క్యాంపులోని రైతు బజార్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉద్యోగులు కూడా ప్రతినెలా మూడో శనివారం శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేస్తాం. రైతుబజార్లను 1999లో నేనే ఏర్పాటు చేశాను. రైతులకు గిట్టుబాటుధర రావాలి. వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందజేయాలనే ఒక మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేశాం. మేం తెచ్చిన రైతు బజార్ల వల్ల రైతులు లబ్ధి పొందారు. వనియోగదారులకు కూడా ఎంతో మేలు జరిగింది. కర్నూలు సి క్యాంప్ రైతు బజారును - మిగతా2లో





# స్వర్ణ ఆంధ్రలో విద్య ఒక ప్రధాన స్తంభం

- సమాజోద్ధరణ కోసం విద్యను ఉపయోగించాలి
- ఏఐకి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్




**(అంకుశం, అనంతపురం, మే 17):**

స్వర్ణ ఆంధ్రలో విద్య ఒక ప్రధాన స్తంభం. నైపుణ్యాభివృద్ధి కళాశాలలు, ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో, విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహిం చడంలో పెట్టుబడులు వస్తున్నాయని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ)లో శనివారం నిర్వహించిన - మిగతా2లో

# జగన్‌కు నమ్మినబంట్లు.. జైలు పాలు

## ఏసీబీ కోర్టుకు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

## సంచలనాలు వెలుగులోకి వస్తున్న మద్యం కుంభకోణం కేసు

**(అంకుశం, అమరావతి, మే 17):**

వైఎస్ కుటుంబానికి ముఖ్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో నంబర్ 1, నంబర్ 2గా చెలామణి అయిన సీఎంవో మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ కె.ధనుంజయరెడ్డి, అప్పటి సీఎం ఓఎస్‌డీ కృష్ణ మోహన్‌రెడ్డిలు మద్యం కుంభకోణం కేసులో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిని శనివారం ఏసీబీ కోర్టుకు తరలించి జడ్జి ఎదుట హాజరు పరిచారు. అంతకుముందు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఇప్పటివరకు ఏడుగురిని సీఐడీ అరెస్టు చేసింది. ఇప్పటికే రాజ్ కెసిరెడ్డి, చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, దిలీప్, గోవిందప్ప, బాలాజీలను అరెస్టు చేసిన సీఐడీ.. శుక్రవారం రాత్రి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను - మిగతా2లో







## ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను

# రెన్యూవల్ చేయాలి





- చేయకుంటే తీవ్ర పరిణామాలు ప్రజా ఉద్యమం తప్పదు
- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరిక
- కేంద్రం చర్యలతో ఆర్డీటీ మనుగడే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితి
- ఎన్నికల సమయంలో ఆర్డీటీ చుట్టూ తిరిగిన రాజకీయ నేతలు
- ఎన్నికల తర్వాత మాటలకే పరిమితం అవుతున్న వైనం
- ఆర్డీటీ సేవలు ఆగిపోతుండడంతో నష్టపోతున్న పేదలు
- ప్రధాని మోదీతో భేటీలో ఆర్డీటీ సేవలను నారా లోకేష్ ప్రస్తావించాలి
- తక్షణం ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి
- సేవ్ ఆర్డీటీ పేరుతో తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ
- బ్రహ్మసముద్రంలో ర్యాలీని ప్రారంభించిన అనంత వెంకటరామిరెడ్డి

VicenteFerrer
Rural Development Trust

**అంకుశం ప్రతినిధిఅనంతపురం (బ్రహ్మసముద్రం), మే 17 :**

ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ (ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత - మిగతా2లో



# ఆగస్టు 15న మహిళలకు పండుగ






-మొదటిపేజీ తరువాయి

రూ.6 కోట్లతో ఆదర్శ రైతుబజారుగా అభివృద్ధి చేస్తాం. పక్కనే ఉన్న స్థలంలో అండర్ గ్రౌండ్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తాం. రాష్ట్రంలో ఇప్పటి వరకు 125 రైతు బజారులు ఉన్నాయి. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రైతు బజార్లకు సేంద్రియసాగులో పండించిన కూరగాయలు వచ్చేలా చూస్తాం.

### నెల రోజుల పాటు యోగా డే..

ప్రపంచం గర్వించేలా విశాఖలో యోగా డే నిర్వహిస్తాం.. ప్రధాని మోదీ కూడా వస్తున్నారు. యోగా డేను నెలరోజులపాటు నిర్వహిస్తాం. ప్రజలకు శిక్షణ ఇస్తాం. ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట యోగా చేయాలని కోరుతున్నా. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ ఇస్తాం. నెట్ జీరో వేస్ట్ కోసం ప్రజలంతా ఆలోచించాలి. ప్రపంచంలో ఏ వస్తువూ వృథా కాదు.. అన్నీ ఏదో ఒక రూపంలో ఉపయోగపడతాయి. తడిచెత్త,
పొడి చెత్తను వేరు చేయాలి. అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చూడాలని ఆదేశించా. చెత్త నుంచి



విద్యుదుత్పత్తి చేస్తున్నాం.. రెండు ప్రాజెక్టులు పనిచేస్తున్నాయి. రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, కడపలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. డ్వాక్రా, మెప్మా మహిళలు పారిశ్రామికవేత్తలుగా
మారుతున్నారు. గ్రామాల్లో చెత్తను ఎరువుగా మార్చే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. చెత్తను వేరు చేసి రీసైక్లింగ్‌కు పంపిస్తే.. వాటిని మళ్లీ వాడతారు. జపాన్‌లో ఎక్కడా రోడ్ల మీద కాగితం కనిపించదు.. అదీ సామాజిక బాధ్యత. ఆ దేశంలో రోడ్డుపై పేపర్ కనిపిస్తే ఇంటికి తీసుకెళ్లి చెత్తబుట్టలో వేస్తారు. మన రాష్ట్రంలో కూడా ప్రజల్లో చైతన్యం రావాలి.

### వ్యర్థాలతో ఎరువుల తయారీ..

రైతు బజారులో ఏర్పాటు చేసిన కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారీని సీఎం చంద్రబాబు పరిశీలించారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో ఉద్యానవనం అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. పాణ్యంలో స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను సన్మానించిన సీఎం చంద్రబాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభితో పాటు కర్నూలు జిల్లాకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలి

-మొదటిపేజీ తరువాయి

వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. "సేవ్ ఆర్డీటీ" పేరుతో శనివారం వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మసముద్రం నుంచి కళ్యాణదుర్గం వరకు చేపట్టిన ఈ ర్యాలీని బ్రహ్మసముద్రంలో అనంత వెంకటరామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఐదున్నర దశాబ్దాల క్రితం జిల్లాలో కరువు పరిస్థితులు, పేదరికాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్డీటీని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించారు. ఏళ్ల తరబడి చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని చూరగొంది. ఆర్డీటీ సంస్థ ఆరోగ్య పరంగా, విద్య పరంగా, పేదలను ఆదుకునే విషయంలో, కూలీలకు పనులు కల్పించడంలో, వాటర్‌షెడ్లను నిర్మించి భూగర్భ జలాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. క్రీడలను ప్రోత్సహించి ఎంతో మంది జాతీయ స్థాయికి వెళ్లేలా చేసింది. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ఇలాంటి సంస్థపై మతసంస్థగా ముద్రవేసి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించకుండా ఇబ్బంది పెడుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఎఫ్‌సీఆర్‌ఏను తాత్కాలికంగా రెన్యూవల్ చేశారు. అప్పట్లో కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నేత, ఇప్పటి మంత్రి సత్యప్రసాద్, టీడీపీ నాయకులు అంతా వెళ్లి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలోఎన్డీయే ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కానీ ఆర్డీటీ కష్టాలను పట్టించుకోవడం మానేశారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయని కారణంగా ఆర్డీటీకి విదేశీ నిధులు ఆగిపోయాయి. అనేక సేవలకు అంతరాయం ఏర్పడింది. చివరకు ఆర్డీటీ సంస్థ ఇతర దేశాలకు వెళ్లిపోయే పరిస్థితిని తీసుకొస్తున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో ఆర్డీటీ అనేక సేవలు చేసింది. సుమారు 3800 గ్రామాల్లో సేవ కార్యక్రమాలు చేస్తోంది. ఆర్డీటీ సేవలకు అంతరాయం కలగడంతో ప్రజలు ఉద్యమించే



పరిస్థితి వచ్చింది. ఎన్డీయే ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్రంలో చంద్రబాబు మాటలకే పరిమితం అవుతున్నారు. ఆర్డీటీని రక్షించుకోవాలన్న ఏకైక లక్ష్యంతో తలారి రంగయ్య నాయకత్వంలో వైసీపీ నాయకులంతా ప్రజా ఉద్యమం చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు అనంతపురం జిల్లాలో ఇటీవల పర్యటించారు. కానీ ఎక్కడా ఆర్డీటీకి భరోసా కల్పించేలా చర్యలు తీసుకోలేదు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఈ రోజు (శనివారం) ప్రధాని మోదీని నారా లోకేష్ కలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సేవలను మోదీకి తెలియజేసి తక్షణం ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసేలా చర్యలు తీసుకోవాలి" అని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, రఘునాథరెడ్డి, కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.


# అనంతలో కదం తొక్కిన జనం దేశాభిమానం





- తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న దగ్గుపాటి ప్రసాద్
- జాతీయ జెండా పట్టుకుని నగర వీధుల్లో ప్రదర్శన

**అంకుశం న్యూస్ అనంతపురం మే 17 :**అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో శనివారం ఉదయం జాతీయ జెండాలతో జనం కదం తొక్కారు జవానులకు మద్దతుగా ఇండియన్ ఆర్మీకి మద్దతుగా పెద్ద ఎత్తున అనంతపురం నగర ప్రజలు యువత అన్ని వర్గాల ప్రజలు జాతీయ జెండాతో భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. పహల్గాం లాంటి సంఘటనలు పునరావృతమైతే ఆపరేషన్ సిందూర్ లాంటివి కూడా పునరావృతం అవుతాయని చేతల్లో చెప్పిన ఇండియన్ ఆర్మీకి సెల్యూట్ చేస్తున్నట్టు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా జాతీయ జెండా చేత పట్టుకుని నగర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, బండారు శ్రావణి శ్రీ, పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యామిని బాల, జిల్లా అధ్యక్షుడు వెంకట సూర్య యాదవ్ లతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ నుండి సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు ఎమ్మెల్యే జాతీయ జెండా పట్టుకుని ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ తో మన ఇండియన్ ఆర్మీ శక్తి ఏంటో ప్రపంచమంతా తెలిసిందన్నారు. ఉగ్రవాదంపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటం అనిర్వచనీయమన్నారు. ఎక్కడా పాకిస్తాన్ పౌరులకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాదులే టార్గెట్



గా మన సైన్యం పని చేస్తోందన్నారు. ప్రపంచం గర్వించదగ్గ త్రివిధ దళాలు ఒక్క మన దేశంలోనే ఉన్నాయని యావత్ దేశం మొత్తం మన సైన్యం వెంట ఉంటుందన్నారు. దేశ సమైక్యతను చాటే విధంగా ఇంత మంది తిరంగా యాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

## జగన్‌కు నమ్మినబంట్లు.. జైలు పాలు

-మొదటిపేజీ తరువాయి

అరెస్టు చేసింది. కడప జిల్లాకు చెందిన ధనుంజయరెడ్డి సర్పంచ్‌గా కొనసాగుతూనే అప్పట్లో ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించారు. డెహ్రాడూన్ రాష్ట్రంలో ఉద్యోగం సంపాదించడంతో వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ వచ్చారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అయన్ను రాష్ట్రానికి బదిలీ చేయించడంతో అప్పటి నుంచి ఇక్కడే కొలువు చేస్తున్నారు.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్నీ తానై పాలన నడిపించి అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇందులో భాగంగానే మద్యం కుంభకోణానికి సంబంధించి జగన్‌కు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. ఇక కృష్ణ మోహన్‌రెడ్డి విషయానికొస్తే ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో ఇడుపులపాయలో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారం వైఎస్ కుటుంబాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. అప్పటికే ఆర్డీవో హెూదాలో ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి ఇడుపులపాయ అసైన్డ్ భూముల వ్యవహారం తేలిగ్గా పరిష్కరించడంతో ఆయన ఆ కుటుంబానికి మరింత దగ్గరై ఏకంగా తన ఉద్యోగానికి రాజీనామా చేసి వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ జగన్ వెంట నడిచారు. మద్యం కుంభకోణానికి సంబంధించి ముడుపుల వ్యవహారంలో కృష్ణమోహన్‌రెడ్డి కీలకంగా వ్యవహించారని సిట్ అధికారులు గుర్తించి అరెస్టు చేశారు.

## స్వర్ణ ఆంధ్రలో విద్య ఒక ప్రధాన స్తంభం








-మొదటిపేజీ తరువాయి

14వ స్నాతకోత్సవం కార్యక్రమానికి కులపతి హెూదాలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. నేటి స్నాతకోత్సవం అకడమిక్ విజయాన్ని సాధించడానికి విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాలకు నివాళి. శాస్త్రీయ, సాంకేతిక సవాళ్లను కొనసాగించే మీ సామర్థ్యం మీ మానసిక సామర్థ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా జ్ఞాన సముపార్జన మరియు అభివద్ధికి దోహదపడింది. మీ విజయాలు, మీ స్వంత సామర్థ్యాలను మాత్రమే కాకుండా, సహాయక తల్లిదండ్రులు, సలహాదారులు మరియు స్నేహితుల ప్రభావాన్ని కూడా ప్రతిబింబిస్తాయి. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ అనంతపురం ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీలలో అసాధారణమైన విద్యను అందిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ సాంకేతిక విశ్వవిద్యాలయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలను కవర్ చేస్తూ జేఎన్టీయూ అనంతపురం స్థానిక యువతకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చింది. 2008లో ప్రారంభమైనప్పటి నుండి జేఎన్టీయూ అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడంలో నైపుణ్యం కోసం ప్రయత్నిస్తూనే ఉంది. స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడాన్ని నిర్ధారిస్తూ, సమ్మిళిత అభివద్ధి యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. పునరుత్పాదక ఇంధన పార్కులు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ క్లస్టర్లు మరియు సహజ వనరుల పరిరక్షణ వంటి గ్రీన్ ఎకానమీ చొరవలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ఈ చొరవల ద్వారా, ఆంధ్రప్రదేశ్ ప్రపంచ సుస్థిర అభివద్ధి లక్ష్యాలతో తనను తాను సమలేఖనం చేసుకుంటూ, వృద్ధి సమానంగా, పర్యావరణ అనుకూలంగా ఉండేలా చూసుకుంటోంది. స్వర్ణ ఆంధ్ర 2047 అనేది ఒక స్థిరమైన, సంపన్నమైన మరియు ప్రగతిశీల రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రజా%-%కేంద్రీకృతపై దృష్టి పెడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, సెమీ%-%అర్బన్ ప్రాంతాలలో నైపుణ్యాభివృద్ధి కళాశాలల స్థాపన, విద్యార్థులకు పరిశ్రమ%-%సంబంధిత వృత్తి శిక్షణ, ఉపాధి నైపుణ్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎలక్ట్రానిక్స్, తయారీ, ఆరోగ్య సంరక్షణ, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ పొందారు.

### ఏపీ విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు రావాలని..

ఇతర దేశాల్లోని ప్రఖ్యాత సంస్థలతో సహకారం ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది. మొత్తంమీద, ఆంధ్రప్రదేశ్ ఒక డైనమిక్, సమ్మిళితమైన మరియు భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని ఉన్నత విద్యా వ్యవస్థను నిర్మించడానికి చురుకుగా పనిచేస్తోంది, ఇది విద్యార్థులు వికసిత్ భారత్, స్వర్ణ ఆంధ్ర 2047 కు దోహదపడేలా చేస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒకసారి చెప్పినట్లుగా, 'స్టార్టప్ ఒక సామాజిక సంస్కృతిగా మారింది. మనం ఇప్పుడు అల్, మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్ ద్వారా నడిచే నాల్గవ పారిశ్రామిక విప్లవంలో ఉన్నాము. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పురోగతికి అనుగుణంగా ఉండటానికి, విద్యార్థులు సంబంధిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలి.

### వీరికి పతకాలు ..

హైదరాబాద్ లారెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా.సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్ ను రాష్ట్ర గవర్నర్ ప్రధానం చేశారు. అనంతరం 41 మందికి బంగారు పథకాలను గవర్నర్ అందజేశారు. అందులో పూజిత్ కుమార్ రెడ్డి అత్యధికంగా ఆరు బంగారు పథకాలు, విద్యార్థిని సుప్రజా నాలుగు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ వైస్ ఛాన్సర్ ప్రొ. హెచ్.సుదర్శనరావు, ఐఐటి కాన్పూర్ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ప్రొ.ఎంఆర్. మాధవ్, ప్రభుత్వ సెక్రెటరీ డా.ఎం.జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఎస్పీ పి. జగదీష్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, జేఎన్టీయూ రిజిస్టర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డా.పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బిన్‌లాడెన్ హతం తరహాలో ఆపరేషన్ సిందూర్

**ఇంటర్నెట్‌డెస్క్:** ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా హతమార్చిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మునుపెన్నడూ లేని విధంగా పాక్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరివేసిందని వ్యాఖ్యానించారు. 2011, మే 2న అమెరికా దళాలు ఇదేవిధంగా వ్యవహరించాయని లాడెన్ పేరు ప్రస్తావించకుండా మాట్లాడారు. "ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక బెంచ్ మార్క్‌ను నిర్ణయించింది" అని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్రమూకలకు మాత్రమే నష్టం వాటిల్లిందని అన్నారు. అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై సెప్టెంబర్ 11, 2001లో (9/11) అల్‌ఖైదా జరిపిన ఉగ్ర దాడిలో సుమారు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మందిని పొట్టన పెట్టుకున్న అల్‌ఖైదా అధినేత బిన్ లాడెన్‌ను 2011 మే 2న అమెరికా దళాలు హతమార్చిన విషయం తెలిసిందే.

# ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలి





జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

**అంకుశం న్యూస్ పుట్టపర్తి,, మే 17 :** వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి జీవితంలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారుమన ప్రాంతం, మన రాష్ట్రం స్వచ్ఛదనంతో ఉన్నప్పుడే స్వర్ణాంధ్ర సాధన సాధ్యమవుతుందని అన్నారు. ప్రతీఒక్కరూ స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కొత్తచెరువు మండల ప్రధాన కేంద్రంలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ సర్కిల్ మానవ హారంగా పాల్గొన్నారు సబికులచే స్వర్ణాంధ్ర స్వచ్ఛంద ప్రతిజ్ఞ గావించారు. అనంతరం బస్టాండ్ నందు చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కొత్త చెరువు మేజర్ పంచాయతీ కార్యాలయం నందు జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉష్ణ తాపం నుంచి ఉపశమనం కల్గించే లక్ష్యంతో ఈ నెల స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ రోజు నుంచీ నెల రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో వేడి నుంచి రక్షణ పొందే మార్గాలు, వడదెబ్బపై అవగాహన, నివారణా చర్యలను సూచించడం, చలివేంద్రాల ఏర్పాటు, మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. మానవ దేహంలో అధిక శాతం నీరు ఉంటుందని తెలిపారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరు నీరు సమృద్ధిగా తాగాలని తెలిపారు. పశుపక్షాదులకు సైతం త్రాగునీరు అందించే ఏర్పాటు చేయాలని కోరారు. చెట్లు వాతావరణ తాపాన్ని తగ్గిస్తాయని, కాబట్టి ప్రతీఒక్కరూ విరివిగా మొక్కలను నాటాలని సూచించారు. ప్రతీఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే ఆరోగ్యకరంగా ఉంటారని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సమత,%ఙఱఱఎఎ% పిడి విజయేంద్రప్రసాద్, ఎమ్మార్వో నీలకంఠారెడ్డి, ఎంపీడీవో నటరాజ్, మెడికల్ ఆఫీసర్ అశ్వత్ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# నిరంతర శ్రామికుడు గుత్తా హరి

జన్మదినవేడుకల్లో సేవా కార్యక్రమాలు



**అంకుశం న్యూస్ అనంతపురము, మే 17 :**నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ సిఇఓ గుత్తా హరి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రముఖ విద్యావేత్త, ఫౌండేషన్ ముఖ్య సలహాదారు గొర్తి వెంకటస్వామి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రి వద్ద పండ్లు పంపిణీ చేశారు. పలు కాలనీల్లో పచ్చదనం - పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు, హెడ్మాష్టర్ గొర్తి వెంకటస్వామితో పాటు, సాయి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ విజయ సాయి కుమార్, పలువురు కవులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. పి. రమేష్ నారాయణ, ప్రముఖ విద్యావేత్త నల్లాని రాజేశ్వరి ప్రత్యేకంగా జన్మదిన శు భాకాంక్షల సందేశం పంపించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, గుత్తా హరి సేవలను ప్రశంసించారు. నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ సిఇఓగా, ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ జాతీయ అధ్యక్షులుగా, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షులు, ఎపి రాష్ట్ర అధ్యక్షులుగా, సాహిత్య భారతి అధ్యక్షుడిగా ప్రముఖ కవి, రచయిత, సామాజిక కార్యకర్త గుత్తా హరిసర్వోత్తమ నాయుడు విశేష సేవలందిస్తున్నారని వివరించారు. అంకితభావంతో నిరంతర కృషి కొనసాగిస్తున్న గుత్తా హరిసర్వోత్తమ నాయుడు అంచెలంచెలుగా ఎదుగుతున్నారని చెప్పారు. జిల్లా రచయితల సంఘం (జిరసం) అధ్యక్షుడుగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, జిల్లా కార్యదర్శిగా వివిధ బాధ్యతల్లో సుదీర్ఘకాలం కొనసాగారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ (ఎపిజిపి) రాష్ట్ర సభ్యులుగా తనదైన శైలిలో సేవలందించారన్నారు. శ్రీశ్రీ కళావేదిక నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రపంచ రికార్డు సభల్లో తనవంతు భాగస్వామ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్.ఆర్.ఐ. ఫౌండేషన్ సి.ఈ.ఓ.గా, వనిత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులుగా, అనంత సాహితీ ప్రస్థానం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా బహుముఖ సేవలందిస్తున్నారని వివరించారు. అధికార భాషా సంఘం జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సభ్యులుగా, ఉదయ్ విద్యాసంస్థల సిఈఓగా, ఏపి చిన్న - మధ్య తరహా పత్రికల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గా పనిచేశారన్నారు. సాహిత్య భారతి అధ్యక్షులుగా, మహాత్మా గాంధీ సేవా ట్రస్ట్ ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారన్నారు. గుత్తా హరి రాస్తున్న కవితలు, వ్యాసాలు పలు పత్రికలు, ప్రత్యేక సంచికల్లో ప్రచురితమవుతున్నాయన్నారు. ఆయన రచనలు, సేవలకు గుర్తింపుగా ఇప్పటికే పలు అవార్డులు, సత్కారాలు లభించాయన్నారు. 2012 జనవరిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డును అప్పటి కలెక్టర్ వి. దుర్గాదాస్ చేతులమీదుగా అందుకున్నారని చెప్పారు. శ్రీశ్రీ కళావేదిక సభల్లో పలు పురస్కారాలు, సత్కారాలు పొందారని, పలు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థలు అనేకసార్లు ఘనంగా సత్కరించాయని వివరించారు.

# పరిశుభ్ర ధర్మవరం వైపు పటిష్ఠ అడుగులు





- వైద్య విద్యా ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.
- మంత్రి సత్య కుమార్ యాదవ్ నేతృత్వంలో ధర్మవరం పట్టణ అభివృద్ధికి నూతన ఊపిరి.

**అంకుశం న్యూస్ ధర్మవరం, మే 17:** శ్రీ సత్యసాయి జిల్లాధర్మవరం శాసనసభ సభ్యులు, రాష్ట్ర వైద్య విద్యా, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పట్టణ అభివృద్ధికి వినూత్న చర్యలు చేపట్టారు. శనివారం పట్టణంలోని 27వ మరియు 28వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలతో కలిసి మంత్రి గారు బహుళ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంలో ఏ దశలోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. 27వ, 28వ వార్డుల అభివృద్ధికి రూ.3 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు రూ.2.4 కోట్ల విలువైన 39 చెత్త సేకరణ వ్యాన్లు, 12 ట్రాక్టర్లు మరియు మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0 ప్రాజెక్టు కింద రూ.29 కోట్లతో నీటి సరఫరా పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. రైల్వే శాఖ అనుమతుల అనంతరం పనులు వేగంగా ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. విద్యుత్ పోల్స్ మరియు వీధిదీపాల కొరతపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం మంత్రి గారు ఇందిరమ్మ కాలనీలో రూ.3.35 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్లు, కాలువలు, ప్రభుత్వ స్థలాలకు కంచె నిర్మాణాల పనులకు భూమిపూజ నిర్వహించారు. పనులు నాణ్యతతో, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను చాటుతూ ఎర్రగుంట్లలో మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈరోజు నాటే మొక్కలు రేపటి తరం ఆరోగ్య భవిష్యత్తుకు బాట వేస్తాయి, అని ఆయన తెలిపారు. అలాగే గాంధీనగర్‌లో నిర్వహించిన బటర్‌ఫ్లై ఫోటో షూట్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు ఈ సృజనాత్మక కార్యక్రమాలు యువతను ఆకర్షిస్తున్నాయి. దేశ రక్షణలో భారత సైనికుల ధైర్యం, సమర్పణను ప్రశంసించిన మంత్రి గారు, సరిహద్దుల్ని కాపాడుతూ ప్రాణత్యాగం చేసే సైనికులు ప్రతి భారతీయుని గర్వకారణం. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై దేశం గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారత ప్రజలు 'భారత్ మాతాకీ జై' అంటూ సైనికులకు మద్దతుగా నిలవాలి, అంటూ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ అన్ని కార్యక్రమాల ద్వారా ధర్మవరం పట్టణ అభివృద్ధిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని ప్రజలు అభినందిస్తున్నారు. అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణకు సమపాళ్లలో ప్రాధాన్యం ఇస్తున్న మంత్రి దృష్టికోణం ధర్మవరం భవిష్యత్తుకు మార్గదర్శకమవుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఆర్డీవో మహేష్, 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబులమ్మ, బిజెపి పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, తెలుగుదేశం నాయకులు కమతం కాటమయ్య, అంబటి సతీష్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, పోతుకుంట రాజు, మైనార్టీ నాయకుల నబి రసూల్, కృష్ణాపురం జమీర్, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, చంద్రమౌళి, కుంచూపు నారప్ప, బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, మహిళా కార్యకర్తలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 65 ఏళ్ల తర్వాత 3గ్రామాలకు పండుగొచ్చింది.. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

శ్రీ నసనకోట దుర్గమాంబకు వైభవంగా బోనాల సమర్పణ

మూడు గ్రామాల నుంచి బోనాలతో కదిలిన మహిళలు

4వ రోజు కూడా జాతర మహోత్సవంలో పాల్గొన్న పరిటాల కుటుంబం







**అంకుశం న్యూస్ అనంతపురం మే 17:** 65 ఏళ్ల తర్వాత శ్రీ దుర్గమాంబ జాతరతో 3గ్రామాలకు పండుగ వచ్చిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలంలోని నసనకోట దుర్గమాంబ జాతర మహోత్సవాల్లో నాల్గవ రోజు బోనాల సమర్పణ వైభవంగా సాగింది. మూడు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో అమ్మవారి క్షేత్రం ఒక జనసంద్రన్ని తలపించింది. నసనకోట, గంగంపల్లి, వెంకటాపురం గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తమ ఇంటి నుంచి బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చారు. మూడు గ్రామాల ప్రజలు ఒకచోట కలవడంతో ఒక సందడి వాతావరణం కనిపించింది. ఎంతో భక్తి శ్రద్ధలతో మహిళలు దుర్గమాంబను కొలుస్తూ బోనాలు సమర్పించారు. నాల్గవ రోజు కార్యక్రమాల్లో కూడా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. పరిటాల కుటుంబం నుంచి ఎమ్మెల్యే సునీత కుమార్తె స్నేహలత అమ్మవారికి బోనం సమర్పించారు. అంతకుముందు ఉదయం జాతర మహోత్సవంలో భాగంగా అభయాంజనేయస్వామి విగ్రహానికి 108 విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కలశాలతో విశేష అభిషేకం, పంచామృత అభిషేకం, పంచ సూక్తాది అభిషేకం, సహస్ర క్షీర ఘటాభిషేకం, శతసిద్ర అభిషేకం, గో శృంగార అభిషేకంతో పాటు పూర్ణహారతి కార్యక్రమాలు అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించారు. రేపటి రోజు జరిగే కార్యక్రమంతో జాతర మహోత్సవం ముగియనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ దాదాపు ఆరు దశాబ్దాల క్రితం ఇక్కడ జాతర మహోత్సవం జరిగినట్లు గ్రామ పెద్దలు చెబుతుంటారన్నారు. అయితే చాలామంది ఆ జాతరను చూడలేదన్నారు. అందుకే తాను ఎమ్మెల్యే అయ్యాక జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. 5రోజులపాటు జరుగుతున్న ఈ ఉత్సవాలకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రేపటితో ఈ జాతర మహోత్సవం ముగుస్తుందని ఆమె అన్నారు. నసనకోట నుంచి ముత్యాలమ్మ, దుర్గమ్మ, వెంకటాపురం నుంచి ఎల్లమ్మ, గంగంపల్లి నుంచి గంగమ్మ, హరియనచెరువు నుంచి పోతరాజులు ఇలా ఐదు మంది దేవతలకు ఇక్కడ విశేష పూజలు జరిగాయన్నారు. 80 ఏళ్ల క్రితం నాటి శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్టను కూడా చేసినట్లు వివరించారు. ఐదు గ్రామాల ప్రజలు తమ ఆడపడుచులను బంధువులను ఇంటికి పిలిచి ఘనంగా ఈ జాతర మహోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. దుర్గమ్మ క్షేత్రానికి అన్ని సౌకర్యాలు ఉండాలన్న ఉద్దేశంతో ఇక్కడ కోటి 30 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్లు పరిటాల సునీత వివరించారు. రేపటి రోజు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ హరిహర రాయలు, బుక్కరాయల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోందన్నారు. ఇక్కడ శాసనాల ద్వారా ఈ ప్రాంత చరిత్రను వివరించారన్నారు. 65 ఏళ్లుగా జాతర జరగకపోవడంతో రెండు తరాల ప్రజలకు ఈ ఆలయ విశిష్టత తెలియకుండా పోయిందన్నారు. 1278లో ఈ ఆలయాన్ని నిర్మించారంటే ఇక్కడ దుర్గమ్మ అమ్మవారిని అంతకు మునుపే ప్రతిష్ట జరిగి ఉంటుందన్నారు. ఇక్కడ ఈ ప్రాంత ప్రజలతో పాటు బయట ప్రపంచానికి ఈ ఆలయ విశిష్ట తెలిపే విధంగా జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు....

## భారీవర్షాలు వచ్చే వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

- : చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉంది..

- : అవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటికి రాకూడదు.. ఇళ్లలోనే ఉండాలి

- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



**అంకుశం న్యూస్అనంతపురం, మే 17 :** అనంతపురం జిల్లాలోభారీవర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సూచించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందని, ప్రమాదకరంగా ప్రవహిస్తున్న చెరువులు, వాగులు, వంకలను ఎవరు దాటి ప్రయాణించరాదన్నారు. వర్షాల వేల ప్రమాదకర రహదారుల్లో కూడా వెళ్లరాదన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటికి రాకూడదని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ప్రజలకు సూచించారు. భారీ వర్షాల వేళ జిల్లాలోని తడకలేరు, పండమేరు, పెన్నా, హగరి (వేదవతి), చిత్రావతి, కూతలేరు, ఉప్పు వంక, తదితర నదులు, వాగులు, వంకలు, పరివాహక ప్రాంతాల పరిధిలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో మొత్తం 146 ట్యాంకులు ఉండగా, అందులో 2,935 %వీజఖీ% క్యూసెక్కుల కెపాసిటీ కలిగిన నీరు నిలువ ఉంచే అవకాశం ఉందన్నారు. అందులో ఇప్పటికే 20 ట్యాంకులు 100 శాతం నీరు నిల్వ ఉండగా, మరో 20 ట్యాంకులు 75 శాతం నీటితో నిండి ఉన్నాయని, 43 ట్యాంకులు 50 శాతం నీటితో నిండి ఉన్నాయని, మరో 63 ట్యాంకుల్లో 25 శాతం నీరు నిల్వ ఉన్నాయన్నారు. మళ్లీ వర్షాలు వస్తే ఇప్పటికే పూర్తిగా నిండిన 20 ట్యాంకుల పరిధిలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు వస్తే ప్రజలు ఎవరూ బయటికి రాకూడదని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. జిల్లాలోని ఉరవకొండ మండలం బూదిగవి చెరువు మరువ పారుతోందని, శనివారానికి సాధారణ స్థితికి చేరుకుంటున్నారు. భారీ వర్షాలు సమయంలో జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదని సూచించారు.